క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన సత్తూరి బాలరాజ్‌గౌడు వారి తండ్రి సత్తూరి వెంకటయ్యగౌడ్ జ్ఞాపకార్థం రూ.11 వేల విలువైన మైక్ సెట్‌ను సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. దాతలు సహకరించి తోడ్పాటునందిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. మైక్‌సెట్‌ను అందజేసిన బాలరాజ్‌గౌడును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయ బృందం వెంకటనారాయణ, వెంకటేష్‌యాదవ్, చెన్నప్ప, బిందు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాన్‌గల్: సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కులను సోమవారం మండలంలోని గోప్లాపూర్, అన్నారంతండాలకు చెందిన బాధితులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. గోప్లాపూర్‌కు చెందిన పల్లవికి రూ.12,500, శంకర్‌నాయక్‌కు రూ.12,500, మిద్దె పోషన్నకు రూ.11 వేల చెక్కులను కాంగ్రెస్ నాయకులు పుల్లారావు, అన్నారంతండాకు చెందిన లక్ష్మికి మంజూరైన రూ.13,500 చెక్కును కాంగ్రెస్ నాయకులు రేక్యానాయక్, ప్రేమ్‌నాయక్ అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, మంజూరుకు కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్, దశరథం, రాజాగౌడ్, కృష్ణ, బాలకృష్ణ, బిక్యానాయక్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి అండగా...

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా పెద్దమందడి కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు, తమ చిన్ననాటి స్నేహితురాలికి అండగా నిలిచారు. జోగులాంబ గద్వాల జిల్లా మేళ్లచెరువు గ్రామంలో ఉంటున్న స్నేహితురాలు కళ్యాణి భర్త వేణుగోపాల్ నాయుడు(45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె కుటుంబానికి ఆర్థికంగా సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. స్నేహితులంతా కలసి రూ. 56వేలు సేకరించి సోమవారం మేళ్లచెరువులో ఉంటున్న కళ్యాణి వద్దకు వెళ్లి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు మనోధైర్యం చెప్పి, కష్టకాలంలో తోడుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

తపస్ మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల

కొత్తకోట: తపస్ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలోని కొత్తకోటలోని ఎమ్మార్సీ భవన ఆవరణలో సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల మహాధర్నా ఉంటుందని, ఈ ధర్నాకు కొత్తకోట, మదనాపురం మండలాల ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంఈఓ జె.కృష్ణయ్య, తపస్ మండల అధ్యక్షుడు రాఘవేంద్రచారి, ప్రధాన కార్యదర్శి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు శివనారాయణ, వరలక్ష్మి, జిల్లా కార్యదర్శి రాములు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు వివేకానంద, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని తపస్ జిల్లా నాయకులు కృష్ణయ్య, వగ్గు ఉమాశంకర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు చేతుల మీదుగా మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. 17న హైదరాబాద్‌లోని ఇందిరపార్క్‌లో చేపట్టనున్న ధర్నాకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, శాంతన్న తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ బాలరాజుకు అందజేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములుయాదవ్ అన్నారు. పట్టణ కేంద్రంలో సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులను వారు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నిరంతరం శ్రమించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రణధీర్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఎండీ ఆరీఫ్, మన్యం,కృపాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ముస్తాక్, విజయసింహారెడ్డి, విజయవర్ధన్‌గౌడ్, వెంకట్‌రత్నం పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతోనే ప్రతిభ గుర్తింపు



పాన్‌గల్‌లో ప్రతిభ విద్యార్థులతో ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ జీవశాస్త్రం సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో ఇంగ్లిష్ మీడియంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి లక్ష్మి ప్రథమ స్థానం, కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి శివ ద్వితీయ స్థానంలో.. తెలుగు మీడియంలో పాన్‌గల్ కస్తూర్బా విద్యాలయం విద్యార్థి మౌనిక ప్రథమ స్థానం, కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి వంశీ ద్వితీయ స్థానం సాధించగా.. వారికి ఎంఈఓ శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 18వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టులో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ్, తెలంగాణ జీవశాస్త్రం సైన్స్ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రఘురాముడు, మద్దిలేటి, భాస్కర్, ప్రేమలత, కృష్ణ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బయో సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మల్లీశ్వరి, శోభన, హర్షిత, పురందేశ్వరి ప్రతిభను కనబర్చడంతో వారికి నగదుతో పాటు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ కొండాపురం బాలరాజు, కాంప్లెక్స్ జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, జీహెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, బయోసైన్స్ ఫోరం కన్వీనర్ శివలీల, బయోసైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.

వీపనగండ్ల: పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించినప్పుడే ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఇంగ్లిష్ మీడియంలో మనోజ్ ప్రథమ బహుమతి గెలుచుకోగా, రెండో బహుమతి సురేష్, తెలుగు మీడియంలో మొదటి స్థానం ప్రత్యూష, రెండో స్థానంలో అనూష తమ ప్రతిభ చూపారు. కార్యక్రమంలో సైన్స్‌ఫోరం సభ్యులు శ్రీనివాసులు, మహేశ్వర్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.



వీపనగండ్లలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ నర్సింహులు

‘అరెస్టులు కాదు.. పెండింగ్ బిల్లులు చెల్లించాలి’



పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

పాన్‌గల్: అరెస్టులు చేయడం కాదని, జీపీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల సంఘం మండల నాయకుడు సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీపీల పెండింగ్ బిల్లుల చెల్లింపులు చేయాలని కోరుతూ మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జీపీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల కాక మాజీ సర్పంచ్‌లు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం బిల్లులను విడుదల చేయాలని కోరారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు బాలస్వామియాదవ్, రాములు, నాగేష్‌నాయుడు, శ్రీనివాసురెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పలువురు మాజీ సర్పంచులను సోమవారం ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహించిన తరువాతనే అసెంబ్లీ నిర్వహించాలని ‘చలో అసెంబ్లీ’ కార్యక్రమానికి మాజీ సర్పంచ్‌లు జేఏసీ పిలుపునిచ్చిన నేపథ్యంలో.. మండలం నుంచి ఈ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లు బాలాంజనేయులుగౌడ్, వెంకటరమణ, తిరుమలేష్, బీఆర్‌ఎస్ నాయకుడు బాలీశ్వర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

వీపనగండ్ల: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్ పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు వెళ్తారన్న ఉద్దేశంతో ముందస్తుగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



వీపనగండ్ల: రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పరశురాములు మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే ఉమ్మడి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం విద్యా, ఉద్యోగాల్లో సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో రవివర్మ, గడ్డమీది విజయ్, శ్రీరాం, భవాని, తిలక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భూ అక్రమ పట్టా రద్దు చేయాలి



మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో సర్వే నంబర్ 238, 239లో ఉన్న ఎస్సీల ఇనాం భూమిని గ్రామానికి చెందిన గొల్ల చిన్న హనుమంతు అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఎస్సీలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వాటికి సంబంధించిన ఓవర్సీని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఎస్సీ, ఎస్టీ కమీషన్ చెర్మన్ బక్కి వెంకటయ్యకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మినారాయణ, నాగరాజు, రామచంద్రయ్య, శ్యాంసన్, వెంకటమ్మ, అంజయ్య హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా భూమి కోసం మమ్మల్ని వేధిస్తున్నాడని, ఆయనపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఎలాంటి సంబంధం లేని వ్యక్తి తమ భూములను ఆక్రమించుకోవడంపై తాము ఆందోళన గురవుతున్నామని వివరించారు. సత్వరమే తమ న్యాయం చేయాలని కోరారు.

బోనస్ దోచుకునేందుకు బీఆర్‌ఎస్ కుట్రలు

కొత్తకోట రూరల్: బీఆర్‌ఎస్ నేతలు రైతులకు అందించే బోనస్‌ను అక్రమంగా పొందేందుకు కుట్రలు పన్నుతున్నారని కిసాన్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కొత్తకోట మండలంలోని నాటవెల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు వరి ధాన్యం కొనుగోలు చేసి, తెలంగాణలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్న దళారీలను గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పట్టుకున్నారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈనెల 7న డీసీఎంలో అక్రమంగా ధాన్యం తీసుకొచ్చిన దళారులను గ్రామస్తులు గుర్తించి అధికారులకు అప్పగించారు. సోమవారం కిసాన్ కాంగ్రెస్ నాయకులు నాటవెల్లికి చేరుకుని ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, మాసన్న, బీచుపల్లియాదవ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

కొత్తకోట రూరల్: ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలను సోమవారం మండలంలోని రామనంతాపూర్, నిర్వేన్ గ్రామాల్లో అధికారులు పరిశీలించారు. యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న వారి గ్రామానికి వెళ్లి ఇళ్లు ఉందా? లేదా? ఉంటే ఏ స్థితిలో ఉంది, పడిపోయిందా? ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారనే వివరాలను నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ చెన్నమ్మ తెలిపారు. మండలంలో 11వేల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు సర్వే నిష్పక్షపాతంగా జరగాలని ఎంపీడీఓ చిన్నమ్మ సిబ్బందిని సూచించారు.



వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ

సోనియాగాంధీతోనే తెలంగాణ కల సాకారం



వనపర్తిలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు



మదనాపురంలో..

సాక్షి, నెట్‌వర్క్: ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ చొరవతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాల వద్ద కేక్ కట్ చేయడంతో పాఠశాలల్లో విద్యార్థులు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

- కొత్తకోటలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌జె బోయేజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీచుపల్లి, మేస్త్రీ శ్రీను, గొల్ల బాబన్న, పీజే బాబు, జేఎం మిషేక్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఆగారం ప్రకాష్, క్యామ రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.
- మదనాపురం మండల కేంద్రంలో మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వడ్డె కృష్ణ, జగదీష్, టీసీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ పట్టణంలోని ఇందిరాగాంధీ చౌక్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, తులసీరాజ్, రహ్మతుల్లా, పరమేష్ తదితరులు ఉన్నారు.
- అమరచింతలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మహాంకాళీ విష్ణు, తిరుమలేష్, హనుమంతు నాయక్, పోసిరిగారి విష్ణు, తౌఫిక్, శ్యాం పాల్గొన్నారు.
- వనపర్తి రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయచందర్ ఆధ్వర్యంలో, డీసీసీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ నాయకుడు సయ్యద్ అక్తర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, ఎండీ రహీం, సత్యంసాగర్ తదితరులు పాల్గొన్నారు.
- చిన్నంబావి ప్రధాన చౌరస్తాలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌యాదవ్, శ్రీలతరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు
- పెబ్బేరు పట్టణంలో కారుపాకుల వెంకట్రాములు యాదవ్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. అనంతరం రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన్యం, నరేందర్, కృపాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- గోపాల్‌పేటలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కొంకి రమేష్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలి

వీపనగండ్ల: మహిళలపై తరచూ జరుగుతున్న దాడులను నివారించాలంటే వారి రక్షణకు ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయ ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హింసా వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పాలకులు మారినా మహిళలపై జరుగుతున్న దాడులు, హింసను అరికట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హింసకు కారణమైన మద్యం, డ్రగ్స్, పబ్‌లను పూర్తిస్థాయిలో నియంత్రించాలని సూచించారు. మహిళా సాధికారతకు పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్లు, రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అరుణ, ఉపాధ్యాయులు మమత, పారిజాత, సంఘం నాయకులు శివలీల, లక్ష్మి పాల్గొన్నారు.

‘అమరుల త్యాగాలతోనే తెలంగాణ’

ఖిల్లాఘనపురం: ఎంతోమంది తెలంగాణ ముద్దుబిడ్డల ప్రాణ త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరాహార దీక్ష, ఎంతో మంది యువకులు, విద్యార్థులు, వివిధ రంగాల్లో ఉన్న వారి ఆత్మత్యాగాలు, నిరసనలు, ఉద్యమాలతోనే తెలంగాణ ఆకాంక్ష నెరవేరిందన్నారు. ఏనాడు తెలంగాణ కోసం ఉద్యమం చేయని వారంతా నాయకులుగా చలామణి అవుతుండటం దురదృష్టమన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎంతో మంది మేధావులు ఆలోచించి తెలంగాణ తల్లి రూపాన్ని సిద్ధం చేయగా.. నేడు కాంగ్రెస్ పెద్దలు తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ, నెత్తిన కిరీటం, కాళ్ల కడియాలు తదితర చిహ్నాలను మాయం చేసి కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తు వచ్చేలా తెలంగాణ తల్లి విగ్రహం తయారు చేయడం ప్రజల మనోభావాలను కించపర్చినట్లే అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, భూమయ్య, గొడుగు సత్యం, బెస్త గోపాల్, బాల్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, సింగోటం, ప్రతాప్, చెన్నయ్య, గోపి, బుచ్చిబాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్ సాగర్, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు పాఠశాలకు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరుతూ పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు రెండు కంప్యూటర్లతో పాటు విద్యార్థుల విజ్ఞాన విహార యాత్రకు ఆర్థిక తోడ్పాటునందిస్తామన్నారు. సొంత గ్రామ పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. విద్యార్థులు మంచిగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజ్ఞాన విహార యాత్రకు మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి రూ.10వేలు, మాజీ సర్పంచ్ జయరాములుసాగర్ రూ.5 వేలు విరాళం అందిస్తామన్నారు. శ్యాంసుందర్‌గౌడు, రాజు, కళ్యాణ్, డీలర్ వెంకటయ్య, శివ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



గోవర్ధన్‌సాగర్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

భక్తిశ్రద్ధలతో భవానీమాత ఉత్సవాలు

అమరచింత: మండలంలోని తూక్యానాయక్‌తండాలో సోమవారం తుల్జాభవానీ మాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చంద్రనాయక్‌తండా, తూక్యనాయక్‌తండా, దీప్లానాయక్ తండా, కొత్తతండాలో ఆదివారం నుంచి మారెమ్మ యాడిదేవర్లతో పాటు భవానీ మాత ఉత్సవాలు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ మేరకు తూక్యానాయక్‌తండాలో ప్రజలు ఇళ్ల ఆవరణలో మండపాలు ఏర్పాటు చేసి, తుల్జాభవానీ అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మంగళ, బుధవారాల్లో ఉత్సవాలు కొనసాగనున్నట్లు తండావాసులు తెలిపారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్ట్

వనపర్తి విద్యావిభాగం: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని రామేశ్వరమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, సాత్విక మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి పట్టణంలో విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని రావూస్ కళాశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు 98 మంది విద్యార్థులు హాజరు కాగా.. చాణక్య స్కూల్‌కు చెందిన అక్షర మొదటి స్థానంలో నిలిచి రూ.3వేల నగదు, ప్రతిభ హైస్కూల్ చెందిన కె.ప్రేమ్‌సాయి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.2వేలు, శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన ఎం.అర్జున్‌చంద్ర తృతీయ స్థానంలో నిలిచి రూ.వెయ్యి నగదు బహుమతులను గెలుచుకున్నారు. పెబ్బేరు మోడల్ స్కూల్‌కు చెందిన ఒమేజ్ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి స్థానంలో నిలవడంతో నగదు బహుమతిని అందుకున్నాడు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లేశ్, రావూస్ కళాశాల ప్రిన్సిపల్ కొండ శ్రీనివాసులు, అమరేందర్‌రెడ్డి, వినోద్, రామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మంకాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మంకాల శ్రీనివాసులు

‘లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు చూపాలి’

అమరచింత: పేదలు దుంపాయికుంటలో రెండేళ్లుగా గుడిసెలు నిర్మించుకుని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి అన్నారు. దుంపాయికుంటలో గుడిసెలు నిర్మించుకున్న వారిని సోమవారం సీపీఎం నాయకులు కలిసి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపడం లేదని 24 ఏళ్లుగా పోరాడిన ఫలితం లేకపోవడంతో సీపీఎం మద్దతులో గుడిసెల పోరుకు సిద్ధమయ్యారన్నారు. ప్రభుత్వం ఇంటి స్థలాలు చూపుతామంటూ కాలయాపన చేసిందని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో వాకిటి శ్రీహరికి ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించుకున్నా.. ఇప్పటికీ ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. మూడు రోజుల క్రితం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి సమస్య పరిష్కరించమని కోరినా స్పందించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్, ఆర్‌ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కార్మికులకు వైద్య పరీక్షలు

ఆత్మకూర్: అభివృద్ధిలో పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని, ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతకు అందరూ కట్టుబడి ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేశారు. పూలమాలలతో సత్కరించి సమగ్రరక్షణ్ పథకంలో భాగంగా రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు.

ఘనంగా ఉర్సు

అమరచింత: మండలంలోని నందిమళ్లలో సోమవారం శ్రీహజరత్ మహబూబ్ ఉస్సేనీ దర్గా ఉర్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సందేరాళ్ల పోటీలను నిర్వహించారు. విజేతలకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తనయుడు అచ్యుతారాం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.12,016, రెండో బహుమతిగా రూ.7,016, మూడో బహుమతిగా రూ.4,016, నాల్గో బహుమతిగా రూ.2,016 నగదును విజేతలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

ఆత్మకూర్: అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈనెల 14వ తేదీన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మాలధారులతో సమావేశమై ఏర్పాట్లను పర్యవేక్షించి, పట్టణంలో ప్రతిష్ఠాపన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదాన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు వేలాదిగా తరలిరావాలని కోరారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పెబ్బేరు రూరల్: ఇటీవల కర్నూల్ జిల్లాలో జరిగిన సౌత్ ఇండియన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పెబ్బేరు మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. సుమన్ షోటోకాన్ కరాటే కిడ్స్ అకాడమీకి చెందిన విద్యార్థిని మేఘన గ్రాండ్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. అదేవిధంగా కటాస్ విభాగంలో కార్తికేయ, గణేష్, జస్వంత్, దేవాన్స్, హిమాన్స్ పతకాలు సాధించారు. స్పైరింగ్ విభాగంలో గౌతమ్, రిషికేశ్, కార్తీక్, తస్విన్, హరినాథ్, తనుష్, బాలికల విభాగంలో వేదవతి, జోషిక, భవిత పతకాలు సాధించారని మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు.